
# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక





సంపుటి-10 సంచిక-1 ఆగస్టు-2025 ఎడిటర్ - డాక్టర్ రాధా కుసుమ



Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com

www.kusumajayabheri.org

# కవితలు

## పుడమి తల్లి - కల్పవల్లి

కవి: శ్రీ మొగలిమాల
ఊరు: పటాన్ చెరు, సంగారెడ్డి జిల్లా.



దేహానికి మూలమైన పుడమి తల్లి !
విశ్వ దేశానికి ఆధారం కల్పవల్లి !

అమ్మ ప్రేమ నిస్తుంది !
కొమ్మ నీడ నిస్తుంది !

ప్రతి జీవికి పోషణతల్లి రక్షణ !
మనిషి దేహానికి పరిశుభ్రత సంరక్షణ!

నిలువ నీడకై తరువు !
నిలువ నీటికై చెరువు !

ప్రతి మనిషికి శ్రద్ధవల్ల ఆరోగ్యం పెరుగుతుంది !
స్నేహ బంధాల వల్ల ఆనందం కలుగుతుంది!

ఓ మనిషి నీ బాధ్యత కాదా వృక్షాల సంరక్షణ !
పుడమికి అవియే కదా పర్యావరణ పరిరక్షణ !

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు !
హరితవనం కొరకు మొక్కలు నాట్లు!

మనిషి బ్రతుకు తెరువు కోసం పంటలు ఆధారం !
పుడమిపై జనులకు వర్షమే కదా జీవనాధారం

చెట్లను పెంచడం మన బాధ్యతగా భావిద్దాం !
ప్లాస్టిక్ వాడకాన్ని మానేసి కాలుష్యాల్ని నిర్మూలిద్దాం!

దేశప్రగతికి పునాదులుగా నిలుద్దాం !
పర్యావరణ పరిరక్షణకై ప్రమాణం చేద్దాం!



# అన్నా చెల్లెల అనుబంధం

కవి: ముత్యం వెంకటేశ్వరరావు
గురజాల, పల్నాడు జిల్లా



అవనియందు అపురూపమైనది
అన్నా చెల్లెల ప్రేమానుబంధం
ఎన్నటికీ ఎప్పటికీ చెదరని సుగంధం
మమతలు పంచే పేగు బంధం..

అన్నా చెల్లెల ఆత్మీయ బంధం
మరచిపోలేని రక్త సంబంధం
స్వచ్ఛమైన ప్రేమకు ప్రతిరూపం
జగతిలో వెలకట్టలేని ఈ రక్షాబంధన్.

శ్రావణ పున్నమి రోజు రాఖి పండుగ నా
ఎన్నో ఆశలతో ఎదురుచూసే చెల్లెమ్మ
నేనున్నానని అభయమిచ్చే అన్నయ్య
చెల్లెమ్మ హృదయంలో చందురూడు..

అన్నయ్య కనులలో సంతోషం చూడాలి
చెల్లెమ్మ మోములో నవ్వులు కురవాలి
ఆప్యాయతతో అనురాగం వికసించాలి
అన్నా చెల్లెల ప్రేమానుబంధం
పరవశించాలి!
ముత్యం వెంకటేశ్వరరావు



# పశ్చాత్తాపం

కవి: డా. శాంతిశ్రీ
గురజాల,పల్నాడు జిల్లా

ఉన్నంతసేపు తెలియలేదు మనిషి విలువ విధానం
వాడుకోవడమే ఉన్నన్నాళ్ళు తీరేదాకా అవసరం
కళ్ళముందు కనబడితే గుండెనిండా ఆవేశం
దగ్గరకెళ్ళి పలకరించాలన్నా మొహం మొత్తేసిన నైరాశ్యం
కక్ష్య సాధింపులతో సలసలకాగే మెదడులోని శతృత్వం
పోయారని తెలియగానే మొదట పైశాచిక ఆనందం
బయటకు మాత్రం అందరూ చూడాలని విలాపం
మొసలి కన్నీళ్లని చూపించుకొనే దొంగ ప్రయత్నం
నిజంగా బాధ పడినా ఏమీ చేయలేని పశ్చాత్తాపం
సమాధికి రంగులేసినట్లు పోయి`నోళ్ళకి తెలియలేని అనుబంధం
పోయాక విలాపంతో ఎప్పటికీ అర్థం కాని సంశయం
ఉన్న నాడే బంధానికి విలువనివ్వాలని ముఖ్యమైన సందేశం
ఉన్నా లేకున్నా ఎప్పటికీ మిగలాల్సిన మధుర జ్ఞాపకం
నిజమైన బాంధవ్యాలకు హృదయపూర్వక వందనం





# జీవనయాత్ర




కవి: యక్కంటి పద్మావతి,
గుంటూరు

పుట్టిన దగ్గర నుంచి పుటకల వరకు
కలతలూ కన్నీళ్ళు లేకుండునా..?
పుట్టుకతోనే తప్పుకోలేని జబ్బులూ..
పేదల పాట్లూ..
దొరకని పనులు అబ్బని చదువు సంధ్యలు
అమ్మా..నాన్నల మద్య బెడిసికొట్టే సఖ్యతలూ
కరువైన.ఆలనలు లాలనలు..
చుట్టుముట్టే రోదనలు
బంగరు బాల్య మైనా పెళ్లి తో వచ్చే కష్టాలు
అత్తా.. ఆడపడుచుల ఆరళ్ళు.తోడికోడళ్ళ ఈసులు
కాన్పుల కష్టాలు.. కనికరం చూపని వైద్యులు.
కల్తీ మందులు.పనిచోట్ల సవాళ్లు.చింతలు
మతలబులతో పసలేని విత్తన సంస్థలు..
పురుగు మందులు
ఫలమివ్వని కల్తీ ఎరువులతో రైతుల ఎతలెన్నో..
కాచిన సస్యానికి గిట్టుబాటు దొరకని ధరలు
ప్రకృతి వైపరీత్యాలు.విషాద సంఘటనలు
పొంచియున్న ప్రమాదాలు..
ప్రమోదాన్ని హరించే మనస్పర్థలు.
కరోనా కాలం ఎందరి బతుకుల్లో
కన్నీళ్ళు నింపింది.
కల్తీల పర్వం. ఎందరి ఉసురు తీస్తోంది
కాలాల నిలుస్తూ.ఓర్పునిస్తూ..|
సాగిపోయే జీవన యాత్రలు.



# ఉన్నప్పుడు శత్రుత్వం.. పోయాక విలాపం?

రచన: కె వి యస్ గౌరీపతి శాస్త్రి
గుంటూరు



బ్రతుకు, బంధాలన్నీ, నాటకమని తెలుసు
కథలు పోయేవన్నీ, కంచికేనని తెలుసు

కను మూత నాడేమీ కానమని తెలుసు
నడిమి నడకలన్నీ, చీకటి వెల్గులని తెలుసు

వేదనలు, వేడుకలు  అశాశ్వతమని తెలుసు
యెరిగి మనమీ వేదాంత మెంతగా పలికేము
కానీ, బతుకులాటన మనుషు లంటే అలుసు
మాట నందనుగారము, మనసున ద్వేషము
నిజము పల్కువారిని ఎగతాళుల బాధించేము
వెన్ను పోటులు పొడిచి మోసగాళ్ళుగా చూశాము

కన్నుమూసినంత, నిజమెరుగ, తలచి వగచేము
కట్టె మీద నోదండ, కన్నీటి పన్నీరు ఇంపుగ జల్లేము
కట్టెన ప్రేమ కాలిపోవు, జీవులందు మమత నిల్పవోయి
శత్రుత్వాన క్షణ కాలమే నిల్చి, మిత్రత్వాన మసలవోయి
ఉన్ననాడు శత్రుత్వం, పోయినాక విలాప
మనకెందుకోయి

జగతి, జనుల యందు ప్రేమతో, చిరంజీవిగా
నిలువవోయి.



# తల్లిపాలు

కవి: చంద్రం,
గుడివాడ

అమ్మ దైవసమానురా లనియె శ్రుతులు!
అమ్మ స్థానమునకు నర్హు లన్యు లెవరు?
అమ్మ తరువాతనే యెవ్వరైనగాని!
అమ్మ అగుట అందరికి సాధ్యమ్ము కాదు!



అమృత తుల్యము బిడ్డల కమ్మ పాలు!
అమ్మ పాలు తాగని బిడ్డ అనద బోలు!
అట్టి బిడ్డల రోగాలు ముట్టడించు!
వ్యాధు లెన్నింటినో అడ్డు నమ్మపాలు!

పాలు పడని తల్లుల కౌషధాలు గలవు,
కొందరికి వైద్యమును తగు గుణము నీదు,
ప్రకృతి పాప కొసగు దివ్యవరము తల్లి-
స్తన్య! మది దక్కకున్కి బాధాకరమ్ము!

శిశువులకు తల్లి స్తన్యము శ్రేష్ఠ మనుట
అంద రెరిగిన సత్యమే! అది యటుండ,
తల్లి ఆరోగ్యమునకును స్తన్య మిడుట
మంచిదని వైద్యవరులు వచించు టుండె!



పేగు తెంచుకు పుట్టిన బిడ్డ గాంచి
మధుర భావన దేలదే మాతృమూర్తి?
కూర్మి బిడ్డకు స్తన్యము కుడిపి తల్లి
యెంచదే పూర్వజన్మ సుకృత మటంచు?

తగిన అవగాహనము లేక, స్తన్యమిడిన
తగ్గిపోవును దేహసౌందర్య మనుచు
తలచు చున్నారు కొందరు తల్లు లిపుడు!
తల్లులకు ఈ అపోహలు తగవు,తగవు!

# రాఖీ పండుగ

రచన: డా వి. డి. రాజగోపాల్

అన్నాచెల్లెళ్ళు తోబుట్టువులుగా
ఓ అమ్మ కడుపును పంచుకుని పుట్టి
రెక్కలొచ్చి ఎక్కడికో ఎగిరిపోయినా
ఓ సోదరి తన సోదరులపై
మమతల వర్షం కురిపించే పండుగే రాఖీ



నూలు పోగుల కలయిక దారమైనట్లు
పేగు బంధపు కలయిక
అనురాగాల బంధపు దారంగా
మీ కుడి చేతి కంకణమై
వారికి అండదండగా జీవితాంతం
ఉండాలని గుర్తుచేసేదే రాఖీ

పుట్టుకతో తోబుట్టువులు కాకపోయినా
భావనతో సోదరీమణులుగా
పోగు పోగునా ఆప్యాయతలు కలబోసి
మమతల దారమై కట్టే కంకణం
పేగుబంధానికి తీసిపోదు సుమా!

దూరాన ఉండి రాఖీ కట్టలేకపోయినా
వారి భావతరంగాలు శబ్దతరంగాలుగా
మీ చెవిలో నాట్యంచేసినా
అక్షరసుందరమై మీ సెల్ ఫోన్ లో
అలా తళుక్కుమన్నా
ఒకటే సుమా!

వారు పెద్దలైతే దీవెనలందుకోండి
పిన్నలైతే దీవించండి



# అంతర్జాతీయ జానపద విజ్ఞాన దినోత్సవ శుభాకాంక్షలు







మన జన జీవన సంస్కృతికి
ప్రతిబింబాలైన జానపద కళలను పరిరక్షించుకోవాల్సిన
బాధ్యత ఎంతైనా ఉంది



## కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సాంస్కృతిక e - మాస పత్రిక

Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com
www.kusumajayabheri.org